రథోత్సవానికి రహదారి మరమ్మతులు చేపట్టండి



డిప్యూటీ జోనల్ కమిషనర్ శశికళకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జియాగూడ: జియాగూడ రహదారి సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్యాచ్‌వర్క్ పనులను పూర్తి చేయిస్తానని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ జోనల్ కమిషనర్ శశికళ అన్నారు. సోమవారం జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జె.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు తరలివెళ్లి ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, గోల్కొండ జిల్లా డెయిరీ సెల్ కన్వీనర్ బి.శివకుమార్‌యాదవ్ మాట్లాడుతూ..ఈనెల 28 నుంచి 7 రోజుల పాటు జియాగూడ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. పురానాపూల్ నుంచి జియాగూడ రహదారిలో హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజీ బోర్డు ద్వారా సీవరేజీ పైప్‌లైన్ నిర్మాణం పనులు జరిగి దాదాపు సంవత్సరం దాటింది. సీవరేజీ పైప్‌లైన్ వేసిన తర్వాత గుంతలు మూసివేసి దానిపై ఎటువంటి ప్యాచ్‌వర్క్ చేపట్టకుండా వదిలేశారన్నారు. అలాగే జూన్ 1న జియాగూడ ఆలయం నుంచి రంగనాథస్వామి వారి రథోత్సవం పురానాపూల్ వరకు కొనసాగుతుంది. దారి పొడవునా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బీటీ రోడ్డు లేదా ప్యాచ్‌వర్క్ పనులు వెంటనే చేపట్టాలని కోరారు. అలాగే కమిషనర్‌ను రథోత్సవ వేడుకలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్, డివిజన్ కార్యదర్శి భాస్కర్, గోల్కొండ జిల్లా కార్యవర్గ సభ్యులు రేపాక సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



నిజాం కాలనీలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. రాబోయే వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి అమలు పరుస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న వరద నీటి పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గానికి మజ్లిస్ అధినేత తన ఎంపీ లాడ్స్ నిధులు కేటాయించారన్నారు. రూ.297 కోట్లతో కార్వాన్‌లో వరద నీటి పైప్‌లైన్ పనుల నిర్మాణం శరవేగంగా జరుగుతుందన్నారు. వర్షాకాలం కంటే ముందే వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తానన్నారు. ఈ సమావేశంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ అలీ తదితరులున్నారు.

ఉత్సాహంగా జీఎన్‌ఐటీఎస్ గ్రాడ్యుయేషన్ డే

గోల్కొండ: ఇంజినీరింగ్ విద్యా పూర్తి చేసిన వారికి బంగారు భవిష్యత్తు ఉందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి అన్నారు. షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. 2020–24 విద్యా సంవత్సరం బిటెక్, ఎంటెక్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ప్రొఫెసర్ లింబాద్రి పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత ప్రమాణాలతో చదువు పూర్తి చేసిన వారు ఎంతో ఆత్మ విశ్వాసంతో తమ జీవితంలోని తదుపరి అడుగులు వేయాలని అన్నారు. దేశంలోని సాంకేతిక రంగంలో సరికొత్త ఆవిష్కరణలు చేయడానికి కూడా ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన వారు ఆవిష్కరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో 900 మంది విద్యార్థినులు పట్టాలు పొందారు. అనంతరం ప్రొఫెసర్ లింబాద్రి కళాశాల చైర్‌పర్సన్ శ్రీవిద్యారెడ్డి, ప్రొఫెసర్ సున్నైనాసింగ్‌తో కలిసి ఈఎస్సీ, ఈసీఈ, ఈఈఈ, ఈటీఈ, ఎంటెక్ అంశాలలో ప్రతిభ చాటిన వారికి గోల్డ్ మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొ. ఆర్.లింబాద్రి



పట్టాలు పొందిన జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు

బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట వేయాలి

సుల్తాన్‌బజార్: రాష్ట్రంలో సుపరిపాలన జరిగేలా మేధావులు ప్రభుత్వానికి తగిన సలహాలు, సూచనలు అందించాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ సింగం శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారిని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ(ఐపీసీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సింగం శ్రీనివాసరావు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాలచారి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం వలే సమాజ హితం కోసం పనిచేయాలని కోరారు. అలాగే బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని పార్టీలు ప్రజా సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు కేవీ శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షురాలు పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

31న రంగనాథస్వామి ఆలయ వార్షికోత్సవం



వృత్తిపని వారిని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: నానల్‌నగర్ ఫ్లోర్‌మిల్ తిరుపల్లిగడ్డలోని కొవెల రంగనాథస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం ఆలయ వార్షికోత్సవానికి సంబంధించి పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శతాబ్దాల చరిత్రగల రంగనాథ స్వామి ఆలయాన్ని గత సంవత్సరం పునరుద్ధరించడం జరిగిందని అన్నారు. ఇందులో భాగంగా ఆలయంలో దేవతామూర్తులను ప్రతిష్ఠంపజేయడంతో పాటు ధ్వజస్తంభాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 31న ఉదయం 7.30 గంటలకు స్వామి వార్లకు పంచామృతాలతో అభిషేకం, పూజా కార్యక్రమాలు, 9 గంటలకు స్వామి వారి హోమం ఉంటాయని ఆయన తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం ఆలయ పునరుద్ధరణ కార్యక్రమం నిర్వహిస్తున్న వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాజువస్తాద్, ఎస్.జనార్దన్, ఎం.నర్సింహ తదితరులున్నారు.

జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



సమావేశంలో అభివాదం చేస్తున్న ఆదిల్ షరీఫ్ తదితరులు

అబిడ్స్: జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అదిల్ షరీఫ్ పేర్కొన్నారు. ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించి వారికి సహకరించాలన్నారు. రాంకీ సంస్థతో చేసుకున్న అగ్రిమెంట్‌ను రద్దు చేసేందుకు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్ రెడ్డి, ఆకుల శ్రీనివాస్, వెంపల్లి జైపాల్‌రెడ్డి, రఫీ, జహిరుద్దీన్, జగదీష్, రాజు పాల్గొన్నారు.

పేదల కుటుంబాల్లో తీరని విషాదం

- బుల్లెట్ ట్యాంక్ పేలిన ఘటనలో మూడుకి చేరిన మృతుల సంఖ్య
- కొందరు డిశ్చార్జి మరి కొందరు ఆస్పత్రుల్లోనే..



పెట్రోల్ ట్యాంక్ పేలడంతో మంటలను ఆర్పుతున్న స్థానికులు (ఫైల్)

చార్మినార్: ఆపదలో చిక్కుకుంటారని మానవత దృక్పథంతో సాయం చేసేందుకు వెళ్లిన పలువురిలో ముగ్గురు మృత్యువాత పడగా.. మరో ఏడుగురు తీవ్ర గాయాలకు ఆస్పత్రి పాలయ్యారు. మే 12న పాతబస్తీలో జరిగిన దుర్ఘటన అందరినీ అయ్యో పాపం అనని వారుండరు. తెల్లారితే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్.. పాతబస్తీలో ఎక్కడ ఎన్నికల హడావుడి.. అంతలోనే మొగల్‌పురా రోడ్డులో ఉన్నట్టుండి బుల్లెట్ వాహనంలో మంటలు చెలరేగడం.. మంటలను ఆర్పే ప్రయత్నంలో దాదాపు 10 మందికి పైగా గాయాలు కావడం పాతబస్తీ ప్రజలకు దిగ్భ్రాంతికి గురి చేసింది. సహాయం చేయడానికి వచ్చిన చేతులకే మంట లంటుకున్నాయి. మానవతా దక్పథంతో సాయం చేయడానికి వచ్చిన స్థానికులు బుల్లెట్ వాహనం పెట్రోల్ ట్యాంక్ పేలి పోవడంతో ఆ మంటలకు ఆహుతయ్యారు. 80 శాతానికి పైగా కాలిన ముగ్గురు యువకులు చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో ఏడుగురు నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇందులో ముగ్గురి ఆరోగ్యం కుదుటపడడంతో డిశ్చార్జి అయ్యారు. గాయపడిన వారిలో ఏఆర్ కానిస్టేబుల్ సైతం ఉన్నారు. ప్రస్తుతం డీఆర్‌డీఎల్ అపోలో ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న ఏఆర్ కానిస్టేబుల్‌కు అత్యవసరంగా రక్తం అవసరం ఉంటే భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తన రక్తదానం చేశారు.



ఏఆర్ కానిస్టేబుల్‌కు రక్తదానం చేసిన ఇన్‌స్పెక్టర్ బాలస్వామి (ఫైల్)

అసలేం జరిగింది...

పాతబస్తీ తలాబ్‌కట్టాలోని జహంగీర్‌నగర్‌కు చెందిన అబ్దుల్ రహీం ఖాన్ ఈ నెల 12న బుల్లెట్ వాహనంపై తన భార్యతో కలిసి వెళుతుండగా ప్రమాదావశాత్తు వాహనంలో నుంచి మంటలు చెలరేగడంతో అప్రమత్తమైన వాహనాన్ని వదిలి పక్కకు వచ్చారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కొంత మంది స్థానికులు వెంటనే గమనించారు. హుటాహుటిన మంటలంటుకున్న బుల్లెట్ వాహనం వద్దకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బుల్లెట్ వాహనం పెట్రోల్ ట్యాంక్ పేలి దట్టమైన మంటలు చెలరేగాయి. మంటలను ఆర్పే ప్రయత్నంలో దాదాపు 10 మందికి మంటలు అంటుకున్నాయి.


రెక్కాడితేగానీ డొక్కాడని వారే..

నీటిలో ఉండే ఆక్సిజన్ కారణంగా పెట్రోల్ ట్యాంక్ పేలిపోవడంతో మంటల్లో తీవ్రత పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో అబ్దుల్ రహీం ఖాన్ (30)తో పాటు స్థానికంగా మంటలను ఆర్పేందుకు సహాయం చేసిన సలేహ్, షేక్ అజీజ్, ఖాజా పాషా (26), చెరుకు బండి యజమాని మహ్మద్ నదీం (32), ఫలక్‌నుమా జహంగీర్‌నగర్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి షౌకత్ అలీ (42), చికెన్ సెంటర్‌లో పని చేసే మహ్మద్ హుస్సేన్ ఖురేషి (19), షేక్ ఖాదర్ (25), గౌస్ రహమాన్ (30)లు సైతం గాయాలకు గురయ్యారు. ఈ మంటలను ఆర్పే ప్రయత్నంలో ఏఆర్ కానిస్టేబుల్ సందీప్ (25) సైతం గాయాలకు గురయ్యాడు. ఈ ఘటనలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహ్మద్ నదీమ్ ఈ నెల 13న, మృతి చెందగా.. ఫలక్‌నుమా జహంగీర్‌నగర్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి షౌకత్ అలీ (42) చికిత్స పొందుతూ ఈ నెల 14న, మహ్మద్ హుస్సేన్ ఖురేషి ఈ నెల 24న మృత్యువాత పడ్డారు.

మమ్మల్ని ఆదుకోండి..

అగ్నిప్రమాదంలో మరణించిన ముగ్గురితో పాటు ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారంతా పేదలేనని బాధితుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సహాయం చేయడానికి వెళ్లి అగ్నికి ఆహుతయ్యారని బోరున విలపిస్తున్నారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. స్థానికంగా చిన్నా చితక రోజు వారి పనులు చేసుకుంటూ జీవితాలను నెట్టుకొస్తున్న తమకు తీరని అన్యాయం జరిగిందని ప్రభుత్వం తమపై దయ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

29న గరుడ ప్రసాదం పంపిణీ



శేషాచారి

జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 29న ఉదయం 9 గంటలకు భక్తులకు గరుడ ప్రసాద పంపిణీ కార్యక్రమం ఉంటుందని ఆలయ ప్రతినిధి శేషాచారి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గరుడ ప్రసాదం స్వీకరించడం వల్ల సంతానం లేని వారికి సంతానం, వ్యాధి పీడితులకు ఉపశమనం, కాలసర్ప దోషాలతో ఇబ్బందులు పడుతున్న వారికి ముక్తి, గరుత్మంతుడి అనుగ్రహం చేత సకల దోషాలు తొలుగుతాయన్నారు.

31న మెగా జాబ్‌మేళా

అబిడ్స్: ఈ నెల 31న పరావస్తు క్రియేటీవ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హదరాబాద్ గ్రీన్‌ల్యాండ్, రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీసీపీ పరావస్తు మధుకర్ స్వామి తెలిపారు. ముఖ్యంగా టీచర్ల రిక్రూట్‌మెంట్లతో పాటు పలు సంస్థల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 31వ తేదీ ఉదయం ఆర్పీ రోడ్డులోని ఆర్య సమాజ్ వద్ద ఉన్న గుజరాతి హైస్కూల్‌లో ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. పేరుగాంచిన పలు కంపెనీల్లో దాదాపు 2 వేల ఉద్యోగాల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్, డిప్లొమా, గ్రాడ్యుయేషన్, పీజీ, ఫార్మసీ రంగాలతో పాటు వివిధ విద్యార్హతలు ఉన్నవారు జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగం పొందాలన్నారు. డీపీఓ, బ్యాంకింగ్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫార్మసీ, బీ టూ బీ, ఇన్సూరెన్స్ ఎఫ్ఎంసీజీ ఇతర పలు రంగాల్లో ఉద్యోగాల కోసం జాబ్‌మేళా దోహదపడుతుందన్నారు. నిరుద్యోగులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో మురుగు నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయడానికి తగు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు దేవర వంశీ కోరారు. సోమవారం ఆయన జలమండలి మేనేజర్ మనోహర్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్వాన్ లేబర్ అడ్డా, కార్వాన్ మార్కెట్‌తో పాటు దర్బార్ మైసమ్మ ఆలయం ముందు గల ప్రధాన రహదారిపై ప్రతినిత్యం మురుగు నీరు ప్రవహిస్తుందన్నారు. స్థానిక వ్యాపారులతో పాటు పాదచారులు సైతం రోడ్డుపై మురుగు పరుగుతో ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే సంబంధిత అధికారితో మాట్లాడి డ్రైనేజీలకు మరమ్మతులు చేయిస్తానని జలమండలి జనరల్ మేనేజర్ మహేందర్‌నాయక్ హామీ ఇచ్చారు.



జలమండలి జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దేవర వంశీ తదితరులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చార్మినార్, ఫలక్‌నుమా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టీజీఎస్‌పీడీసీఎల్ చార్మినార్ సీబీడీ ఏడీఈలు ఓ ప్రకటనలో తెలిపారు. కిషన్‌బాగ్, షరీఫ్‌నగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని కిషన్‌బాగ్, అవుట్ పోస్ట్, జల్వా హోటల్, చిరాగ్ అలీ నగర్, షరీఫ్‌నగర్, మహమూద్‌నగర్, ఎంఐ కాలనీ, అసద్‌బాబానగర్, బహదూర్‌పురా తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే షాలిమార్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని బహదూర్‌పురా, ఎంఐ కాలనీ, కిషన్‌బాగ్, మహమూద్ నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. జూ క్వార్టర్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని కిషన్‌బాగ్,జూ క్వార్టర్స్, చిరాగ్ అలీ నగర్, బహదూర్‌పురా తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఈద్గా, పురానాపూల్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని జూ పార్కు రోడ్డు, పురానాపూల్, మెట్రో థియేటర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

ఫలక్‌నుమా యూజీసీ, ఛత్రినాక విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ తెలిపారు. అలాగే ఫలక్‌నుమా ఓహెచ్, జీఎం ఛావునీ తదితర విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు. పటేల్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే వట్టేపల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు. లాల్ దర్వాజ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు. గుంటల్‌షా దర్గా విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సైఫాబాద్ డివిజన్ పరిధిలో..

అబిడ్స్: సైఫాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో ఉండదని సీబీడీ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఫీడర్ పరిధిలోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్, డైరెక్టర్ ఫైనాన్స్, సుజాత స్కూల్, ఛర్మాస్ హౌస్, మెడ్విన్ ఆసుపత్రి, విజయ బ్యాంక్, చాపల్‌రోడ్డు, మహేష్‌నగర్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12:30 నుంచి 2 గంటల వరకు బాబుఖాన్ ఎస్టేట్ ఫీడర్ పరిధిలోని బాబుఖాన్ ఎస్టేట్, ఎల్‌బీ స్టేడియం రోడ్, హెచ్‌పీ పెట్రోల్ పంప్, కమిషనర్ ఆఫీస్, నిజాం హాస్టల్, ఎల్బీస్టేడియం, జగదాంబ జువెలరీస్ బిల్డింగ్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఏపీ టూరిజం ఫీడర్ పరిధిలోని అంబేద్కర్ స్టాచు, ట్యాంక్ బండ్, లిబర్టీ పెట్రోల్‌పంప్, ఆయిల్ సీడ్స్ క్వార్టర్స్ ఏరియా, స్టాన్జా బిల్డింగ్, దాదుస్ స్వీట్ షాప్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూ సేవలు చిరస్మరణీయం



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మనిలాల్ షా, కుమార్ రావు తదితరులు



నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



నెహ్రూ విగ్రహానికి నివాళులర్పించిన మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్

అబిడ్స్: మాజీ ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి, ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెహ్రూ సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మనిలాల్ షా తదితరులు పాల్గొన్నారు.

లాల్‌దర్వాజా మోడ్‌లో..

గౌలిపురా: జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా సోమవారం లాల్‌దర్వాజా మోడ్‌లోని నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ యాకుత్‌పురా నియోజకవర్గం అసెంబ్లీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టీపీసీసీ సెక్రటరీలు అల్లం భాస్కర్, మామిడి కృష్ణ కుమార్, మామిడి గోపి, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు రాజు యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు డల్లు శివ తదితరులు పాల్గొన్నారు.

చేప ప్రసాదం కోసం వచ్చే వారికి ఆహార పదార్థాలు పంపిణీ చేస్తాం



నాగ్‌నాథ్ మాశెట్టి

చార్మినార్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న చేప ప్రసాదం సందర్భంగా జూన్ 7న ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచితంగా ఆహార పదార్థాలను అందజేయనున్నామని టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి తెలిపారు. ఎగ్జిబిషన్ సొసైటీ అధికారులను అనుమతి కోరుతూ సోమవారం రాతపూర్వకంగా విజ్ఞాపన పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఏడాది తాము ఈ ఉచిత ఆహార పదార్థాల పంపిణీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా అందించనున్నామన్నారు. టీ, టిఫిన్‌లతో పాటు మధ్యాహ్నం భోజనం పంపిణీ ఉంటుందన్నారు. చేప ప్రసాదం కోసం కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘఢ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి ప్రజలు రెండు రోజుల ముందుగానే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు చేరుకుంటారన్నారు. వీరికి ఆహార పదార్థాల అవసరం ఎంతో ఉంటుందని.. అందుకే చేప ప్రసాదానికి ఒక రోజు ముందుగా అంటే జూన్ 7న తమ కార్యక్రమం ఉంటుందన్నారు.

ఘనంగా ఆయిస్టర్ డే



చిన్నారులతో కలిసి ఆయిస్టర్ డే వేడుకల్లో పాల్గొన్న సునీల్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆయిస్టర్ 15వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సునీల్ మాట్లాడుతూ..15వ వసంతంలో పలు కొత్త కార్యక్రమాలకు స్వీకారం చుడుతున్నట్లు తెలపారు. ఇందులో భాగంగా విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పర్యావరణం, విభాగాలకు స్వతంత్ర శాఖలను నియమిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ బాడీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయిస్టర్ సంస్థ రాష్ట్ర కార్యదర్శి షేక్ సోహెల్, అనంత శర్మ, తుంగతుర్తి శివ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు అక్షిత తదితరులు పాల్గొన్నారు.

సంతాప లేఖ అందజేత



ఇరాన్ కాన్సులేట్ జనరల్‌కు సంతాప లేఖను అందజేస్తున్న మోమిన్ షబానా

చార్మినార్: ఇరాన్ అధ్యక్షుడు అయాతుల్లా సయ్యద్ ఇబ్రాహీం రైసీ మృతి పట్ల తమ పార్టీ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుందని పేర్కొంటూ ఇరాన్ కాన్సులేట్ జనరల్ మెహదీ షహరోఖీ కి సంతాప లేఖను అందజేయడం జరిగిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, తెలంగాణ బీజేపీ మైనార్టీ విభాగం ఇన్‌చార్జి మోమిన్ షబానా తెలిపారు. పాతబస్తీకి చెందిన బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో కలిసి ఆమె ఈ సంతాప లేఖను అందజేసినట్లు తెలిపారు.

క్రీడా రంగానికి పెద్దపీట



ప్రశంసా పత్రాలతో చిన్నారులు

చాంద్రాయణగుట్ట: నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఛత్రినాక శివగంగానగర్‌లోని మైదానంలో చిన్నారులకు వెపన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున హాజరైన చిన్నారులకు బూడోఖాన్ ఇంటర్నేషనల్ సీనియర్ మాస్టర్ శివ ప్రసాద్ రాజు కత్తులతో విన్యాసాలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బోయ నరేష్ మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి క్రీడా రంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో క్రీడాకారులకు కల్పించాల్సిన సదుపాయాల విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు గణేష్‌నాయక్‌తో పాటు స్థానిక నాయకులు రాజు యాదవ్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎంఎస్‌డబ్ల్యూ'తో అవకాశాలు మెండు

రాయదుర్గం: సోషల్ వర్క్ అనేది జాబ్ ఓరియంటెడ్ సబ్జెక్ట్ అని 'మనూ' సోషల్ వర్క్ విభాగం హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ షాహిద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మనూ విశ్వవిద్యాలయంలో రెండు సంవత్సరాల మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) కోర్సును అందిస్తోందన్నారు. అభివృద్ధి రంగంలో అవకాశాలు ఏటా పెరుగుతున్నాయని ఎంఎస్‌డబ్ల్యూ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఉర్దూ పరిజ్ఞానంతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ/తత్సమాన కోర్సులో 45 శాతం మార్కులతో ఆసక్తి గల దరఖాస్తుదారులు ఎంఎస్‌డబ్ల్యూ కోర్సునకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.